


# మటన్ సామ్రాట్ కథ

*అమెరికామెడీ కబుర్లు -9*

గత నాలుగు వారాలుగా నేను అమెరికాలో అనేక నగరాలు తిరుగుతున్నాను. రాబోయే నాలుగు వారాలుగా కూడా తిరుగుతూనే ఉంటాను. కారణం ఏమిటంటే హైదరాబాదులో ఉన్న వేగేశ్న ఫౌండేషన్ అనే వికలాంగుల సేవా సంస్థకి నేను అమెరికాలో డబ్బులు పోగేసే కార్యక్రమం చేపట్టి మూడేళ్ళయింది. అందులో భాగంగా అమెరికా అంతటా ఇంచుమించు ముప్ఫై అయిదు ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఆ మహనీయుడి 85 వ జన్మసంవత్సరం సందర్భంగా ఆయన పాటలతో సంగీత కార్యక్రమం ఉచితంగా ఏర్పాటు చేసి, నివాళులు అర్పించి, అందరికీ పుణ్యమూ, పురుషార్థమూ కలిసి వచ్చేలా ఆ కార్యక్రమాలని ఫండ్ రైసింగ్ ఈవెంట్స్ గా తీర్చిదిద్దాం. అంటే ప్రోగ్రాం ఉచితమే కానీ, విరాళాలు ధారాళంగా పుచ్చుకోబడును అన్నమాట. ఈ ఆరాధనోత్సవాలలో పాడుతున్న వారు గాయక శిరోమణి జీ.వీ ప్రభాకర్ గారు (హైదరాబాదు) మరియు హ్యూస్టన్ గాయనీ మణి మణి శాస్త్రి గారు. హైదరాబాదులో వేగేశ్న ఫౌండేషన్ ని గత ఇరవై ఏళ్ళగా అత్యుత్తమ స్థాయిలో నడుపుతున్నది వంశీ రామరాజు గారు. ఆయన అనేక సంవత్సరాలుగా అనేక సన్మాన సభలు నిర్వహిస్తూ సాంస్కృతిక సేవా తత్పరుడిగా కూడా మంచి పేరు సంపాదించారు.

ఈ తతంగంలో నా ముఖ్య పాత్ర ఏమిటంటే ఈ ముగ్గురినీ అమెరికాలో అన్ని చోట్లకీ తీసుకు వెళ్ళే ఏర్పాట్లు చేసి, నేను కూడా వారితో వెడుతూ, చోదక వృత్తి చేస్తున్నాను. అంటే ఘనత వహించిన డ్రైవరు ఉద్యోగమన్న మాట. ఏదో ఒక ఎయిర్ పోర్ట్‌లో దిగడం, కారు అద్దెకి తీసుకోడం, పొలో మని ఎవరింటికో, పాటల కార్యక్రమం జరిగే ఆడిటోరియంకో వెళ్ళడం, మర్నాడు మరొక ఊరికి డ్రైవు చేసుకుంటూ పోడం.... అన్నీ కలిసి అందరం కలిసి అనేక గంటలు సరదాగా ప్రయాణాలు చెయ్యడం....అదీ మా పరిస్థితి.

ఉన్నమాట చెప్పొద్దూ..... ముగ్గురితోటీ అనేక గంటలు విమానంలోనూ, కారులోనూ ప్రయాణం చెయ్యడం నా అదృష్టమే. ఎందుకంటే అందరూ హాస్యప్రియులే....జోకుల మీద జోకులే. ముఖ్యంగా అనేక వేల సన్మానాలు చేసిన అనుభవంతో రామరాజు గారూ, డజన్ల కొద్దీ సన్మానాలు చేయించుకున్న మేము ముగ్గురమూ సన్మానాల టాపిక్ మీద పదే, పదే రక రకాల హాస్య సంఘటనలు సంగతులు జ్ఞాపకం చేసుకుని నవ్వలేక చస్తున్నాం గత నాలుగు వారాలుగా.

ఎవరికి, ఎందుకు, ఎలాగ, ఎంత ఖర్చుతో, ఏ ముఖ్య అతిధితో, ఏ పద్ధతిలో సన్మానం చెయ్యాలో, స్వర్ణ కంకణం వెయ్యాలో, లేకపోతే ఉత్తి శాలువ తో సరిపెట్టెయ్య వచ్చో నిర్ణయించుకోవడం అంత కష్టం కాదు కాదు కానీ వచ్చిన గొడవల్లా సన్మానం చేయించుకునేవాడికి బిరుదు కావాలంటేనే పెద్ద ప్రోబ్లం అన్నారు వంశీ రామరాజు గారు మాటల సందర్భంలో. నా మటుకు నాకు అది పెద్ద సమస్యగా అనిపించ లేదు. ఆ మాటే ఆయనతో అన్నాను. సరే, అలా అయితే మీకో పరీక్ష పెడతాను ఇది వినండి..అని ఆయన ఒక కథ చెప్పారు.

అల్లాఉద్దీన్ కులవృత్తి మటన్ కటింగ్. అతను చిన్నప్పటినించీ ఎంతో కష్టపడి, కులవృత్తిలోనే రాణించి, పిల్లలందరికీ మంచి చదువులు చెప్పించాడు. అతని కొడుకులు ఇద్దరు అమెరికాలో ఉన్నారు. డబ్బుకి ఏలోటూ లేకపోయినా, అతను మటుకు రోజూ కాస్తో, కూస్తో మటన్ కటింగ్ చెయ్యనిదే అతనికి తోచదు. "ఎందుకయ్యా అల్లా ఉద్దీన్, ఇంత పెద్ద ఇల్లు కట్టుకున్నావు, డబ్బుకి లోటు లేదు. ఇంకా ఈ మటన్ కటింగ్ అవస్థ" అని ఎవరయినా అడిగితే "అదేమిటి బాబూ అలా అంటారూ, డబ్బుంటే మటుకు రైతులు భూమి దున్నటం లేదా, పురోహితుడుగారు రోజూ మంత్రాలు చదవడం లేదా, అలాగే నేనూనూ" అంటాడు. చూస్తూండగానే అల్లాఉద్దీన్‌కి వందేళ్ళు వచ్చాయి. కొడుకులు ఇండియా వచ్చి తండ్రికి ఏదైనా మంచి సన్మానం చేసి ఋణం తీర్చుకోవాలనుకున్నారు. మరి ఎలాటి బిరుదు ఇస్తారూ? వంశీ రామరాజు గారు అడిగిన ప్రశ్నకి అందరూ తర్జన భర్జన మొదలుపెట్టాం.

"అవును సుమా, పాటలు పాడేవాడికి అపర ఘంటసాల, గాంధర్వ ఘంట, లేదా అపర బాలూ ఇవ్వవచ్చు, డాన్సులు చేస్తే నాట్య రంభ, నాట్య భారతి లాటి బిరుదులు ఉన్నాయి....ఆఖరికి సినిమా వాళ్ళకి కూడా నట సామ్రాట్, నట రత్న లాటి బిరుదులు, ప్రతీ మీటింగులోనూ అడ్డమైన చెత్తా వాగే "ఒరల్ డయేరియా" వీరులకి సభా సామ్రాట్ లాటి బిరుదులూ, పుష్కలంగా ఉన్నాయి కదా....మరి ఈ అల్లాఉద్దీన్‌కి అవేవీ రావు కదా. అతనికి తెలిసిన కళ అంతా మటన్ కటింగే కదా" అని అనుకుంటూ ఉండగా, నా బుర్రలో ఒక ఆలోచన తట్టింది.

"మటన్ సామ్రాట్" అన్నాను పెద్ద గొంతుకతో.

"మటన్ సామ్రాట్టా? అదేం బిరుదు నీ తలకాయ" అని ఒకరూ "నీ మొహం లా ఉంది" అని మరొకరూ "నీకు బుర్ర లేదు" అని మూడో వారూ నా శారీరంలో ఉన్న అవయవాలపై తమ, తమ అభిప్రాయాలని బాహాటంగా వెలిబుచ్చారు.

"తప్పేముందండీ, మాటకొస్తే అల్లాఉద్దీన్ కొడుకు జమాలుద్దీన్‌కి కూడా బిరుదు కావాలంటే యువ మటన్ సామ్రాట్ అనో, కుటుంబంలో ఎవరైనా పొరపాటున సినిమాలో వేషం వేస్తే, ఇంకేముందీ, మటన్ నట సామ్రాట్ లేదా మటన్ నట రత్న మొదలైన బిరుదులు పుంఖానుపుంఖాలుగా తయారు చెయ్యవచ్చు" అని ఘాటుగా సమర్థించుకున్నాను నా బ్రిలియంట్ ఐడియాని.

"బిరుదు సరే, మరి సన్మాన సభకి అధ్యక్షుడిగా ఎవరిని పిలవాలి? అడిగారు రామరాజు గారు.

"దానికేముంది సార్, సాహితీ సదస్సుకో, పాట కచేరీకో రారు కానీ హోం మినిస్టరో, ఛీఫ్ మినిస్టరో గేరంటిగా వస్తారు. ఈ కటింగులన్నీ వాళ్ళకి అలవాటే కదా! " అన్నాను.

ఈ లోపుగా మా ఇల్లు వచ్చేసింది. సామానులన్నీ తీసుకుని, తాళం తీసి ఇంట్లోకి అడుగుపెట్టగానే "వచ్చారా చోదక సామ్రాట్ గారూ, తమరి మొహం చూసి వారం దాటింది" అని పలకరించింది మా క్వీన్ విక్టోరియా.

"అదేం గ్రీటింగూ,హాయిగా, హనీ, డార్లింగ్, ప్రియా అనకుండా ఈ చోదకమేమిటీ? సామ్రాట్టేమిటీ?" అని కించిత్తు తడబడుతూ అన్నాను సరిగ్గా వారం కిందటి మొహాన్నే పెట్టి.

"అదేనోయ్, నువ్వు వెలగబెడుతున్న ఉద్యోగం కారు డ్రయివింగే కదా. అందుకే నీకు చోదక సామ్రాట్ అనే బిరుదు ప్రదానం చేస్తున్నాను" అని మా ఆవిడ అనగానే మా మిత్రులు మొహామొహాలు చూసుకుని నా మొహం చూడ్డం మానేశారు జాలిపడి.